

రాచకొండ విశ్వనాథశాస్త్రి

# వెన్నెల

పెరటి వసారాలో పంచకింద గదిలో తను పుట్టగానే, మంచం మీద అమ్మ పక్క పడుకోబెట్టగానే కిటికీలోంచి చూస్తే - తనకి బోధపడలేదు గాని - అది అర్ధరాత్రే. అక్కడ నిండు చంద్రుడే. అదంతా పండువెన్నెలే అప్పుడు. ప్రసవించిన బాధతో బరువుగా అమ్మ మూలిగే ఉంటుంది. సంతోషంతో అమ్మ సన్నగా నవ్వే ఉంటుంది. తను ఏడుస్తూ ఆ చంద్రుణ్ణి చూసే ఉంటాడు. ఏడ్చేడ్చి అలిసిపోయిన తన నా రోజున కిటికీలోంచి జారిన చిరువెన్నెల మెల మెల్లగా నిమిరే ఉంటుంది. అమ్మ నొప్పి పోయేలా చల్లగా విసిరే ఉంటుంది.

కాని -

మరొక నెల్లాళ్ళకే, ఎంత రాత్రయిందో కాని అప్పుడు కూడా అదే నిండు చంద్రుడే. అప్పుడు కూడా అయ్యో పండు వెన్నెలే. అప్పుడా చీకటి గదిలో అదే కుక్కి మంచం మీద పడుకొని జీవితంలో వెన్నెల కోసం ఆఖరిసారిగా అటు తిప్పిన అమ్మ ముఖం మీద ఆరని కన్నీటి మీద ఆ కిటికీలోంచి జారిన వెన్నెల జీర జాలిజాలిగా ఆమెని జోకొట్టి ఉంటుంది. ఆమె విడిచిన వెచ్చని చివరి నిట్టూర్పుకి అంతటి తడి వెన్నెల కూడా ఉక్కిరి బిక్కిరయే ఉంటుంది. ఓదార్చ మరింక శక్తిలేక సన్నసన్నగా వెనక్కి వెళ్లిపోయే ఉంటుంది. అప్పుడు తను ఆ పక్కనే ఉన్నాడు కాని అమ్మ కంటి మీద ఆఖరి వెన్నెలని గాని, అమ్మ కంటిలోని కాటుక చీకటిని గాని తను చూడనైనా చూడలేదు. సుఖంగా పడుకోకుండా కళ్లు విప్పి లేచి, కాళ్లూ చేతులూ కొట్టుకొని, నెత్తీనోరూ మోదుకొని, కెవ్వుమని కేరుమని, బావురుమని ఏడవాలని! అయ్యో తనకెవరూ అప్పుడు చెప్పనైనా చెప్పలేదు.

ఆ తరువాత -

కొన్నాళ్లకి - మరి ఏడేళ్లకి, తను తాతగారింటినించి గాభరా గాభరాగా గుమ్మం దాకా ఎవరి చెయ్యో పట్టుకొని వచ్చి, అక్కడనించి రివ్వుమని ఇంట్లోంచి పరిగెట్టి, పెరట్లోకి వెళ్లి, అక్కడ పాట్లపందిరి కింద చాపమీద అచలంగా

పడుకున్న నాన్న దగ్గరికి వెళ్లి, అక్కడ కూర్చున్న అక్కని కావలించుకొని ఏడ్చినప్పుడు తన కళ్లంట కారినవి వెచ్చ వెచ్చని కన్నీటి ధారలే! అక్క కళ్లనించి ప్రవహించినవి కటిక చీకటి రేఖలే. అప్పుడక్కడ ఆ పందిరికింద అటు చూస్తే ఆ నిశ్శబ్దంగా పడున్న నాన్ని మీద - అమ్మయ్యో!

"అక్కయ్యా అదేఁవిఁటది?!"

"ఏమి చెప్పను తమ్ముడా! అది మచ్చ మచ్చల జాతి వెన్నెలే".

ఆ తరవాత, జ్ఞాపకం లేదా?

జ్ఞాపకం ఉందన్ననాడూ వెన్నెలే.

ఏనాడూ?

అక్క పెళ్లినాడు.

ఆనాడు వాకిట్లో పందిరికింద భగభగలాడేది పెట్రోమాక్సు దీపమే అయినప్పటికీ పందిరిపై నంతటా కలకలా వెలిగినది వెన్నెలే. పండు వెన్నెల పందిరికింద పెళ్లి తతంగం మధ్య పళ్లెంలో కనిపించనిది వరుడి కివ్వాల్సిన కట్నమే. అప్పుడు కోపించి పీటలమీంచి లేచి పోయినవాడు రెండో పెళ్లి కుమారుడే. అందరిమధ్యా అంతట అతని కాళ్లు పట్టుకుని గొల్లుమని ఏడ్చినవాడు సాక్షాత్తూ తన తల్లి తోబుట్టువే. అప్పుడే ప్రక్కకిపోయి గదిలో కూలబడిన అక్కకి గుండెనిండా నిప్పులే. ఆమె చుట్టూ చీకటే. అంతలోనే ఆ చీకట్లోంచి లేచి ఆ పసుపు బట్టల్తో పెరట్లోకి పరిగెట్టిన అక్కనిండా, అక్క చుట్టూ ఆ క్షణంలో - ఆహో-అయ్యో- భగ్గుమన్నది బంగారపు వెన్నెలే. ఆ రాత్రి గట్టుమీద కాలుపెట్టి ఆకాశానికి దండం పెట్టి అమ్మయ్యో అమ్మయ్యో ఆ రాత్రి నిరాశతో తన అక్క నూతిలోకి దూకినపుడు నిశ్చేష్టుడై నిలబడిపోయి పైనించి చూసినవాడు శివుని జటాజూటపు చంద్రుడే, కొబ్బరాకుల మీంచి నూతిలోకి జారినప్పటికీ కూడా అక్కని తాకనైనా తాకలేకపోయినవి అతని సుకుమారపు చేతులే. ఆ తరవాత అక్కని "అయ్యయ్యో నా అక్కయ్యని" పైకి తీసిన తరవాత, చల్లారిన ఆమె శోకాగ్నిని చూసి పరితపించి అశ్రుధారలతో ఆమెని తడిపి ముంచెత్తినవి ఆ మహనీయుని, ఆ దయామయుని జాలికన్నులే కన్నులే.

**ఆనాడు వాకిట్లో పందిరికింద భగభగలాడేది పెట్రోమాక్సు దీపమే అయినప్పటికీ పందిరిపై నంతటా కలకలా వెలిగినది వెన్నెలే. పండు వెన్నెల పందిరికింద పెళ్లి తతంగం మధ్య పళ్లెంలో కనిపించనిది వరుడి కివ్వాల్సిన కట్నమే.**

అల్లప్పుడు -

ఆ రోజున -

తన పరీక్ష పాసయిందో లేదో అని సంతబయలు, గట్టువార, కిల్లీకొట్టు దగ్గర సందె చీకట్లో అతి తొందరగా పేపరు వెతికి వెతికి చూచిన రోజున - ముందే వచ్చి కూర్చున్న నెలవంకని చూసి ముఖం మాడ్చుకొని గబగబ దిగి పోయిన ఇనబింబపు ఎరుపింకా ఉన్నప్పటికీ, ఎంతో మసక మసగ్గా వెలిగినదే అయినప్పటికీ - అది కూడా వెన్నెలే. అక్కరకిరాని మూడో క్లాసులో తను పాసయేనని అప్పుడు తను తెలుసుకున్నప్పుడు అస్తమించిన సూర్యుళ్లా అయిపోయినవి తన చిల్లర ఆశలే. కాని పాసయాడదే చాలు, ఎందుకు నీకీ విచారాలు అని - ఆనాటి సంతబయులులో ధూళితోనే నిండినప్పటికీ, గోమూత్రంతో తడిసినప్పటికీ, కిరసనాయిలు వాసనే కాక, ఏవేవో మట్టివాసనలు వేసినదే అయినప్పటికీ, ఎంతో గుడ్డిదే అయినప్పటికీ - తననే హెచ్చరించి చెప్పినదది వెన్నెలే. నునులేత వెన్నెలే.

అలనాడలనా డా రోజున -

అహో! అవునానాడది పసిడి పచ్చని పండు వెన్నెలే వెన్నెలే. అవునానాటిరాత్రి ఆ పందిరినిండా వికసిత మందహాసాలతో విరయబూసినవి నునుమెత్తని మూగమల్లెలే మల్లెలే. ఎంతో కొంతకి ఏదో ఉద్యోగం ఎలాగో ఓలాగున దొరికిందని చెప్తే, పందిరిపక్క కూర్చొని తన గుండెలకి తల ఆన్చుకొని సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చినది మామ కుమార్తె మానవతి శీలవతి తన నెచ్చెలే. ఆనాడు పచ్చగుర్రాలెక్కి పరవళ్లు తొక్కుతూ దేవులంతా కూడి తమ మీద మురిసి కురిపించినవి వెన్నెలవి రేకులే మల్లెలవి నవ్వులే.

ఆనాడు, ఆమె కడుపులో కదిలినది తమ స్వంత ప్రాణమే. మల్లెల రేకుల్లో వెన్నెల నవ్వుల్లో ఆనాడే ఆనాడే ఆ వెన్నెల్లో ఆమె గుండెల్లో చిన్నగా దగ్గినదేదో రోగమే. అవునయ్యా అప్పుడూ వెన్నెలే.

అవును తండ్రీ అప్పుడూ వెన్నెలే. ప్రాణం పోతూన్నప్పటికీ ఆమె కళ్లనిండా నవ్వులే. ఆమె మనసునిండా ఆశలయ్యో ఆశలే. ఆఖరి వరకూ ఆమె చేసేవి బాసలే. కాని, ప్రాణం మరింక పోక తప్పదని ఆమె తెలుసుకొన్నప్పుడు పచ్చటి బాలుణ్ణి తన చేతిలో పెట్టి ఆఖరిసారిగా తనవైపు చూసి నవ్వగా నిల్చిపోయినది ఆమె సత్యకాలపుటూపిరే. ఆమె ముఖంలో ఆఖరికి మిగిలిపోయినవి మూగబాధల నీటి నీడలే - పాలిపోయిన వెన్నెల జాడలే.

పడినవన్నీ చాలు మరిక ఏకష్టమూ పడకుండా పోయిన అదృష్టం ఆమెదే. ఆమె లేకపోతే తనకి బతుకంతా చీకటే అనిపించకుండా తన చేతిలో కాంతిపుంజం పెట్టిపోయిన దానశీలం కూడా ఆమెదే.

అవునది ఆమె జల్లిన వెన్నెలే. అవునది ఆమె ఇచ్చిన భాగ్యమే. తల్చుకుంటే తనకి వళ్లు పులకరిస్తుంది. ఆ నవ్వులు, అవి ఆమె పోలిక నవ్వులే. తనని ఇన్నాళ్లిరవయ్యేళ్లు నిలబెట్టి ఉంచినవి అందు పుట్టిన ఆశలే.

ఆశలే అడియాసలే.

వాని ముఖంనిండా వెన్నెలే కాని, వాని మనసునిండా నీడలే. వాని గుండెనిండా మంటలే. అనేవాడు ఎందుకని అడిగితే!

"అంతటి వెన్నెలే, కాని, ఎచటా చిచ్చులే!"

వెన్నెలా వెన్నెలా, నువు చూపే దృశ్యాలకి మనసు చెదురుతుంది వెన్నెలా! నువ్వు చూపే చిత్రాలకి గుండె కరుగుతుంది వెన్నెలా. అది సహజమే వెన్నెలా కాని ఆయా దృశ్యాలకి, చిత్రాలకి నీ తడితో పడుచు రక్తం ఉడుకుతుందే వెన్నెలా, అది కూడా అతి సహజం కాదటమ్మా వెన్నెలా?

అవును - యువరక్తం ఉడుకుతుందది వెన్నెలా, సుళ్లుగా పరవళ్లు తొక్కుతుందది వెన్నెలా.

వెన్నెలా ఓ వెన్నెలా.

అవు నానాడూ వెన్నెలే.

ఎడతెరిపి లేకుండా, పట్టపగ్గాల్లేకుండా దివినుండి భువికి కురిసిన దానాడది ఎంతో చక్కని వెన్నెలే.

ఆ వెన్నెల్లో ఆ శారదరాత్రిలో తన ఇంటిముంగిట నీడలో బితుకు బితుకుమని కూర్చున్నప్పుడు తనకి వినిపించినవి కేకలే. ఆవేశపు కేకలు విని వేడెక్కినది తన రక్తమే. అంతలోనే ఆ కేకల

**అవునది ఆమె జల్లిన వెన్నెలే. అవునది ఆమె ఇచ్చిన భాగ్యమే. తల్చుకుంటే తనకి వళ్లు పులకరిస్తుంది. ఆ నవ్వులు, అవి ఆమె పోలిక నవ్వులే. తనని ఇన్నాళ్లిరవయ్యేళ్లు నిలబెట్టి ఉంచినవి అందు పుట్టిన ఆశలే. ఆశలే అడియాసలే.**

మధ్య ఆ సత్యాహింసల మధ్య ఏఁవిఁటవి అవేఁవిఁటవి?

అవి

అధర్మానివి మర తుపాకులే.

అన్యాయానివి కోరల కరువులే.

ఊరుకోలేక ఉండబట్టలేక వడివడిగా తడబడుతూ వెళ్లిచూస్తే మిల్లుచుట్టూ మరతుపాకులే. వాటికెడంగా జనప్రవాహమే.

పైకిచూస్తే ఆకాశం నిండా ఏటి చల్లని వెన్నెలే, చుట్టూ చూస్తే వీధినిండా వెండి తెల్లని వెన్నెలే వెన్నెలే. కింద చూస్తే రోడ్డునిండా ఉడుకు రక్తపు మడుగులే మడుగులే. అందులో ఎర్రనెర్రని వెన్నెలే తడి వెన్నెలే.

ఏ బాధలు చూడలేక, ఏ అన్యాయాలని సహించలేక, ఏ అధర్మాన్ని క్షమించలేక ఏ మంటలు భరించలేకపోతే పోయిందని, ఏమయితే అయిందని ఎదిరించి నిల్చిన తన కొడుకు ప్రాణపు వేడినెత్తురు ఎక్కడమ్మా వెన్నెలా?

"నెత్తురంతా చిమ్మి అరవై మందొక్కసారిగ కూలినపుడు నెత్తురంతా ఒక్కటే"

అవును తల్లీ ఒక్కటే. మా నెత్తురంతా ఒక్కటే.

***

కన్నతల్లీ వెన్నెలా.

లోకమంతా వెన్నెలే నీ పాలుపొంగిన వెన్నెలే.

కాని.

మాకు మాత్రం దానినిండా జీరలే. పేద నెత్తుటి వేడి నెత్తుటి జీరలే. దానికింద మాకు మాత్రం విషపు నల్లని చీకటే కారు చీకటే -

వెన్నెలా ఓ వెన్నెలా.

ఓహో మా వెన్నెలా.

అయ్యయ్యో ఓ వెన్నెలా.

*